క్లుప్తంగా

బీమా పథకాలతో ధీమా



బీమా చెక్కును పంపిణీ చేస్తున్న అధికారి

ఓర్వకల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలతో బాధిత కుటుంబాలకు ధీమా లభిస్తుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి నరసింహులు అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు బ్రాంచ్‌లో బీమా కోసం క్లెయిం చేసుకున్న బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం కింద క్లెయిం చేసుకున్న లక్ష్మీదేవి కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున చెక్కును అందజేశారు. బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బాలరంగన్న, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నిరసన



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

ఓర్వకల్లు: స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డ్యాక్యుమెంట్ రైటర్ల నిరసన రెండో రోజు కొనసాగింది. శనివారం సబ్ రిజిస్ట్రార్ ఫైరోజ్‌బాషాకు వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయంలో రెండు రోజుల పాటు సేవలు స్తంభించడంతో ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం నష్టం వాటిల్లిందని దస్తావేజు లేఖర్లు తెలిపారు. ప్రజలకు సాంకేతికతపై అవగాహన లేకపోవడంతో ఆస్తుల క్రయ, విక్రయాల విషయంలో దస్తావేజు లేఖర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. మహేష్, హరినాథ్, స్టాంపు వెండర్ సుధీర్ పాల్గొన్నారు.

మొక్కలను పరిరక్షించడం మన బాధ్యత



మొక్కలను నాటుతున్న ఎంఈఓ

ఓర్వకల్లు: మొక్కలను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఎంఈఓ ఓంకార్‌యాదవ్ అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల ఉపాధ్యాయులకు వచ్చిన హ్యాండ్ బుక్స్‌ను ఆయన పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకుని విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని సూచించారు.

జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ



అంటు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరు: అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ మాధవరాజు సూచించారు. శనివారం పెద్దపాడు దామోదరం సంజీవయ్య బాల సదనంలో అంటు రోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ షణ్ముఖ, బాల సదనం సిబ్బంది విజయ, ఉమాదేవి, విమల, పుణ్యవతి, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ఓటర్ల జాబితాను బీఎల్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన వారి వివరాలను ధృవీకరించి జాబితా నుంచి తొలగించాలని, 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. 2002లో ఉన్న ఓటర్లు ప్రస్తుత జాబితాలో ఉన్నారో లేదో చూడాలని సూచించారు. మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్క్‌లు అందజేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్



సి.బెళగల్‌లో మొక్కలు నాటుతున్న డీఎల్‌డీఓ రమణారెడ్డి, అధికారులు

కర్నూలు(రూరల్): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ సూచించారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న వెంకన్నబావి ప్రాంతంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతులను శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటి, పారిశుధ్య కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్క్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఇ మనోహర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధిచెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. ముందు జాగ్రత్తగా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా తమ వంతుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయించాని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవస్వామి, ఎంపీడీఓ చంద్రశేఖరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, పంచాయతీ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, రెవెన్యూ అధికారి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

సి.బెళగల్: గ్రామాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి, కర్నూలు డీఎల్‌డీఓ రమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ పాందురంగన్న, హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, బసాండ్‌లో విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో మానవహారం నిర్వహించి పచ్చదనం – పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. కొత్తకోటలో సర్పంచ్ శ్రీనివాసులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి సైపుల్లాబేగ్ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించాలి

సి.బెళగల్: విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

సి.బెళగల్: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కర్నూలు డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ మువ్వా గోవిందు సూచించారు. శనివారం ఎంఈఓ – ఆదామ్ బాషాతో కలిసి ఆయన బ్రాహ్మణదొడ్డి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పరిసరాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చేలా చూడాలని హెచ్‌ఎం మారెప్పకు సూచించారు. మారందొడ్డి, సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి, హెచ్‌ఎంలు సత్యవేదమ్మ, నాగలక్ష్మి, టీచర్లకు సూచనలిచ్చారు.



పాణ్యం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

●బస్సులు కిటకిట



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

పాణ్యం: దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పాణ్యం మండలంలోని విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరారు. శనివారం సాయంత్రం తల్లిదండ్రులు పాఠశాలలకు చేరుకుని పిల్లలను తీసుకెళ్లారు. మండల పరిధిలో ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆశ్రమ పాఠశాల, గిరిజన గురుకుల బాలికల పాఠశాల, గిరిజన బాలుర పాఠశాల, గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాల, బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలు ఉన్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి సెలవులు ప్రకటించడంతో వేలాదిగా విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో బస్టాండ్‌లు కిటకిటలాడాయి. ప్రతి బస్సు సామర్థ్యానికి మించి నిండిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా మంది ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించారు.

పారిశుధ్యం బాగుంటే ఆరోగ్యం బాగు



స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కల్లూరు: గ్రామాల్లో పారిశుధ్యం బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, మండల స్థాయి అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త సంపద కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ)లో తడి చెత్త, పొడి చెత్త గురించి, ప్లాస్టిక్ రీసైక్లింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీసీహెచ్‌ఎస్

ఓర్వకల్లు: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని డీసీహెచ్‌ఓ జమీవుల్లా అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మెగా వైద్య శిబిరం జరిగింది. ఆస్పత్రి వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీసీహెచ్‌ఓ జమీవుల్లా, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లాతో పాటు పలువురు రాజకీయనాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఓ జమీవుల్లా మాట్లాడుతూ.. మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'స్వస్త్ నారీ–సశక్త్ పరివార్' నినాదంతో పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె సంబంధిత వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర సమయాల్లో వీటి వినియోగం ప్రాణరక్షకంగా మారుతుందని వివరించారు. వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు నిఖత్ నస్రీన్, కిశోర్‌రెడ్డి, దాదాబాషా, సాయి కుమార్, నవ్యతేజ, డీఆర్‌పీలు క్రీతిబాయి, సుజాత, బిందు కార్తీక, అశ్విని, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో లద్దగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ–స్వశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ అక్టోబరు 2వరకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు వరలక్ష్మి, పీఎస్ సుంకన్న, సీహెచ్‌ఓ శాంత, ఎంపీహెచ్‌ఎస్ శారద, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య పాల్గొన్నారు.

కీర్తి స్కూల్ గుర్తింపు రద్దు

- విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు స్కూల్‌పై కేసు నమోదు
- ప్రకటనకే పరిమితమైన పాఠశాలల తనిఖీలు



కర్నూలు సిటీ: నగరంలోని కీర్తి హైస్కూల్ గుర్తింపును రద్దు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15న ఈ స్కూల్ గోడ కూలి షేక్ రాఖీబ్ అనే విద్యార్థి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్కూల్ కరస్పాండెంట్‌కు నోటీసు జారీ చేయగా అందుకు ఆయన ఇచ్చిన సమాధానం సహేతుకంగా లేకపపోవడం, ఇదే సమయంలో మృతుడి తల్లి వజుదాబాను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న జిలా కలెక్టర్ డాక్టర్ సిరి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు కవాడీ వీధిలోని కీర్తి ఇంగ్లిషు మీడియం ప్రైమరీ స్కూల్ గుర్తింపును రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. అలాగే ఈ స్కూల్‌లో చదువుతున్న పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

తనిఖీలు ఏవీ?

స్కూల్ గోడ కూలి విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు స్కూళ్లను తనిఖీ చేయిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ప్రకటన చేశారు. కానీ ఇంత వరకు తనిఖీలకు ఎలాంటి కమిటీలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. జిల్లాలో 767 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో చాలా వాటిలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కూడా లేవు. చిన్నపాటి తరగతి గదులు, వెలుతురు లేని, గాలి రాని గదులు ఉంటున్నాయి. విద్యాశాఖ అధికారులు అనుమతులు, రెన్యూవల్స్ చేసే సమయంలో స్కూళ్లను సందర్శించాలి. అయితే, అలా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పులకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున కొండపైకి చేరుకుని పూజలు నిర్వహించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గడివేముల: దుర్వేశి గ్రామ సమీపంలోని మేడం వెంకటరెడ్డి మామిడి తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, గడివేముల ఎస్‌ఐ నాగార్జునరెడ్డి శనివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. మూడు బైక్‌లను సీజ్ చేసి రూ.6510 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పీఎంజేజేబీవైను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) సదుపాయాన్ని ప్రతి ఒక్కరు పొందాల్సిన అవసరం ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి పి.నరసింహారావు తెలిపారు. శనివారం ఓర్వకల్ మండలం నన్నూరు బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనపై అవగాహన కల్పించారు. బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు నామమాత్రపు మొత్తంతో ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. ఈ బీమా పథకాలు ఆపత్కాలంలో కుటుంబానికి ఎంతో తోడ్పడుతాయని పేర్కొన్నారు. బీమా పొందిన లక్ష్మీదేవి కుటుంబానికి రూ.2లక్షల బీమా పరిహారాన్ని చెక్ రూపంలో అందచేశారు. కార్యక్రమంలో నన్నూరు బ్రాంచీ మేనేజర్ బాలరంగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్‌లు సత్వరం పరిష్కరించాలి

కర్నూలు(అగ్రికల్చర్): దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉండిపోయిన సమస్యలు, ఇతర డిమాండ్‌లను సత్వరం పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కర్నూలు జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా జేఏసీ రెండో రోజైన శనివారం కూడా స్థానిక విద్యుత్ భవన్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. ఇందులో వివిధ సంఘాల నేతలు పాల్గొన్నా రు. జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ... గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న అనేక హక్కులను, ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తుండటం దారుణమని పేర్కొన్నారు. కో చైర్మన్ శంకర్ మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే హక్కులు, ప్రయోజనాలు కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమని పేర్కొన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్–2 ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేసి వారికి విద్యుత్ సంస్థల సర్వీస్ నిబంధనలను అమలు చేయాలని కోరారు. రిలే దీక్షల్లో జేఏసీ నేతలు నాగశేషులు, రమణమూర్తి, దంలా నాయక్, హుస్సేని, శివకుమార్, తిరుమలయ్య, బాస్కర్, శుభాకర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గేదెలు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోదె

గడివేముల: మండల పరిధిలోని నంద్యాల–నందికొట్కూరు రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రూ.70 వేల విలువైన రెండు బర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మిద్దె జనార్ధన్ గేదెలను శనివారం తెల్లవారుజామున జెడ్పీ స్కూల్ ఎదురుగా తోలుకెళుతుండగా ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలోనే మృతి చెందడం రైతును కలచివేసింది. ఈ ఘటనపై గడివేముల పోలీసులకు సమాచారం ఇచ్చారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కల్లూరు: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కల్లూరు అర్బన్ 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నా రు. శనివారం వివిధ కాలనీల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల ఉద్యోగులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

గడివేముల: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు గోపాలరావు, ఎస్. మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. శనివారం గడివేములలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ.. నాలుగు డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి నివేదిక వచ్చేలోగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేసి, అసెస్మెంట్ పరీక్షల పుస్తక విధానాన్ని పునఃసమీక్షించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి, నాయకులు ప్రతాపరెడ్డి, బాలస్వామి, రాంపుల్లారెడ్డి, రామ్మూర్తి, మల్లికార్జున, వినయ్ కుమార్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం



విద్యార్థులకు బ్యాగ్‌లు అందిస్తున్న ఎంపీడీఓ

పాణ్యం: గ్రామాల పరిశుభ్రతలో అందరూ సహకరించాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం బలపనూరు గ్రామంలో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల సహకారంతో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. అనంతరం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు వివరాలు తెలియజేశారు. విద్యార్థులకు బ్యాగులు అందజేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రమణ్యం, ఏపీఓ శేషన్న, హెచ్‌ఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణతో సకల సంపదలు



గోపూజలో పాల్గొన్న గ్రామస్తులు

పాణ్యం: గో సంరక్షణతో సకల సంపదలు సమకూరుతాయని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం తొగర్చేడు గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో గో సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గోవును కాపాడుకుంటే, పూజిస్తే సకల సంపదలు లభిస్తాయని, ఆలయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రతీకలని తెలిపారు. భాగవతంపై ప్రసంగించి, ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ మహిళలు అధిక సంఖ్యలో గోపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, భజన గురువు బాలనాగిరెడ్డి, రవీంద్రారెడ్డి, అనంతరామయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సింధుజా

గడివేముల: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని శాంతిరాం మెడికల్ కాలేజ్ సైకియాట్రి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సింధుజా అన్నారు. గడివేములలోని జెఎస్‌డబ్ల్యూ స్కిల్ డెవలప్‌మెంట్ యూనిట్‌లో శనివారం 'స్వస్థనారీ –సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు, ప్రభావశీలత, మానసిక ఆరోగ్య ప్రాధాన్యత గురించి వివరించారు. కుటుంబంతో పాటు సమాజ నిర్మాణంలోనూ మహిళలు కీలక పాత్ర పోషిస్తారన్నారు. మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం అవసరమని సూచించారు.

మండలానికి పుస్తకాలు మంజూరు

సి.బెళగల్: రెండో విడతలో భాగంగా మండలానికి 18,056 పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. శనివారం ఎంఈఓ కార్యాలయం చేరుకున్న పుస్తకాలను ఆమె పరిశీలించారు. 43 ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం మొదటి విడతలో 20 వేలకు పైగా పుస్తకాలు మంజూరుకాగా, రెండో విడతలో 18,056 పాఠ్య పుస్తకాలతో పాటు, మరో మూడు వేల ఉపాధ్యాయ కరదీపికలు మంజూరైనట్లు తెలిపారు. ఒకటవ తరగతి రెండవ సెమిస్టర్ తెలుగు, ఇంగ్లీష్ గణితం విలీన పాఠ్యపుస్తకాలు, నాల్గవ తరగతి ఈవీఎస్ రెండవ సెమిస్టర్ విలీన, వర్క్ బుక్కులు రావాల్సి ఉందన్నారు. అనంతరం కొంతమంది హెచ్‌ఎంలకు ఉపాధ్యాయ కరదీపికలను ఎంఈఓ పంపిణీ చేశారు.

బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి చేయూత అందించాలి

కర్నూలు(అర్బన్): పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన బ్రాహ్మణులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ వివిధ పథకాలను అమలు చేయాలని నగర బ్రాహ్మణ సంఘం 411/2015 అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ కలపటపు బుచ్చి రాంప్రసాద్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎన్నికైన ధార్వాడ ఆనందరావు, ఎస్‌కే శ్రీనివాసరావును ప్రముఖ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారామ్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూరా, అఖిల భారతీయ నిత్యాన్నదాన ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ కేవీ సుబ్బారావు తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు చెరువు దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.